క్లుప్తంగా

రామలింగేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ధారపల్లిలో వేంచేసిన ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భారతీయ సనాతన ధర్మరక్షణ మండలి ఆధ్వర్యంలో పండితుడు చీకట్ల వెంకటేశ్వరరావు స్వామి వారికి ప్రత్యేక పూజలు, పంచామృత అభిషేకాలు, అష్టోత్తర సతనామావళి నిర్వహించారు. ధారపల్లి, పెద్దిపాలెం, ఉత్తరకంచి గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

నవధాన్యాల సాగుపై అవగాహన

ప్రత్తిపాడు రూరల్: నవధాన్యాల సాగుతో భూసారం పెరుగుతుందని ఏపీసీఎన్ఎఫ్ ఐబీఎన్డీపీ ఎం.మల్లేశ్వరి అన్నారు. మండలంలోని రౌతుపాలెంలో సోమవారం ప్రకృతి వ్యవసాయ విధానంలో నవధాన్యాల సాగుపై రైతులు, విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం ‘నవధాన్యాల సాగు– నేలతల్లి బాగు’ అనే నినాదంతో గ్రామంలో ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా మల్లేశ్వరి మాట్లాడుతూ నవధాన్యాల సాగుతో భూమిలో జీవవైవిధ్యం ఏర్పడి పంటలకు కావలసిన పోషకాలు లభిస్తాయన్నారు. రైతులు నవధాన్యాల సాగుతో భూమిలో తేమ శాతం, కర్బన శాతం పెరిగి ఫలితంగా దిగుబడి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో లక్ష్మణ్, శ్రీనివాస్, మల్లేశ్వరి, విశాలాక్షి పాల్గొన్నారు.

విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు

శంఖవరం: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నట్లు ఎంఈఓ ఎస్వీ రమణ తెలిపారు. మండలంలోని మండపం జెడ్పీ హైస్కూల్‌ను సోమవారం ఆయన తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు పట్టి, మధ్యాహ్న భోజనం, మరుగుదొడ్లను పరిశీలించారు. ఉపాధ్యాయులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ ఏడాది పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని విద్యార్థులకు సూచించారు.

పెండింగ్ చలానాలు ఆన్‌లైన్‌లో చెల్లించాలి

తొండంగి: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించినందుకు విధించిన పెండింగ్ చలానాలను ఆన్‌లైన్‌లో చెక్ చేసుకోవాలని తొండంగి ఎస్సై ఎస్.రవికుమార్ అన్నారు. తొండంగి, గోపాలపట్నం రైల్వేస్టేషన్ తదితర ప్రాంతాల్లో వాహనదారులకు సోమవారం ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఆన్‌లైన్‌లో వాహనదారులు తమ వాహనాల నంబర్లను టైప్ చేసి పెండింగ్ చలానాలు ఉంటే తక్షణమే చెల్లించాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించి, ప్రమాదాల నివారణకు వాహనదారులు సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్సై రాయవరపు వెంకటరమణ, ఇతర సిబ్బంది ఉన్నారు.

వేంకటేశ్వరస్వామి గ్రామోత్సవం


గజవాహనంపై వేంకటేశ్వరస్వామి గ్రామోత్సవం

కిర్లంపూడి: స్థానిక శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం స్వామి వారికి నిత్యహోమం, బలిహరణ, ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం గ్రామ పురవీధులలో గజవాహనంపై స్వామివారి గ్రామోత్సవం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

వాహనాల తనిఖీ

జగ్గంపేట: జాతీయ రహదారిపై గ్రామ శివారులో స్పీడ్‌గన్‌తో వాహనాల తనిఖీ నిర్వహించినట్లు స్థానిక ఎస్సై విద్యాసాగర్ సోమవారం తెలిపారు. పరిమితికి మించిన వేగంతో ప్రయాణిస్తున్న 76 వాహనాలను గుర్తించి రూ.31,560 అపరాధ రుసుం విధించినట్లు తెలిపారు. జగ్గంపేట సెంటర్లో వాహనాలను తనిఖీ చేసి బండి రికార్డులు సక్రమంగా లేనివారిపై కేసులు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో వివాహిత మృతి

కోటనందూరు: రోడ్డు ప్రమాదంలో వివాహిత మృతి చెందింది. కోటనందూరు పోలీసుల కథనం ప్రకారం ..అమలాపురం కనకదుర్గమ్మ గుడి ప్రాంతానికి చెందిన దోశం జ్యోతి (21) కాకినాడ జగన్నాథపురానికి చెందిన భర్త కాదా బాబురావుతో కలిసి ద్విచక్రవాహనంపై అనకాపల్లి జిల్లా మన్య ప్రాంతానికి వెళ్లింది. తిరిగి నర్సీపట్నం నుంచి తుని వస్తుంటుండగా కోటనందూరు బస్టాండు సెంటర్‌కు వచ్చేసరికి అదే మార్గంలో ముందు వెళ్తున్న పార్శిల్ వ్యాన్‌ను వెనుక నుంచి ఢీకొట్టారు. దీంతో జ్యోతి రోడ్డు మీద పడిపోయి తలకు బలమైన గాయమైంది. తల నుంచి తీవ్ర రక్తస్రావమైన జ్యోతి మృతి చెందినట్లు స్థానికులు గుర్తించారు. జ్యోతిని 108 వాహనంలో తుని ఏరియా ఆసుపత్రికి తరలించారు. పార్శిల్ వ్యాన్ డ్రైవర్ పరారీలో ఉన్నాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై స్వామినాయుడు తెలిపారు.

ప్రకృతి సాగు...లాభాలు బాగు

- సేంద్రియ సాగుతో అధిక దిగుబడులు
- తక్కువ పెట్టుబడితో మంచి ఫలితాలు
- ఆసక్తి కనబరుస్తున్న అన్నదాతలు


పెదశంకర్లపూడిలో సేంద్రియ పద్ధతిలో సాగవుతున్న వరి పంట

ప్రత్తిపాడు: మనం తీసుకునే ఆహారమే మన ఆరోగ్యాన్ని నిర్ణయిస్తుంది. తినే ఆహార పదార్థాలు రసాయనాలు, పురుగు మందులతో నిండిపోతే అవి మన శరీరంపై తీవ్ర ప్రభావం చూపుతాయి. సాగులో విచ్చలవిడిగా రసాయనాల వినియోగంతో కలిగే దుష్పరిణామాలు అన్నీఇన్నీ కావు. పైగా పురుగు మందుల భారమే అన్నదాతలను నిలువునా ముంచుతోంది. దీంతో రైతులు ప్రకృతి సేద్యంపై ఆసక్తి కనబరుస్తున్నారు. తక్కువ పెట్టుబడితో ఆరోగ్యకరమైన అధిక దిగుబడులు సాధిస్తున్నారు.

900 ఎకరాల్లో సాగు

మండలంలో గతేడాది రెండు, మూడు గ్రామాల్లోనే సేంద్రియ సాగు జరిగింది. తక్కువ పెట్టుబడితో మంచి ఫలితాలు రావడంతో రైతులు సేంద్రియ సాగు వైపు మొగ్గు చూపుతున్నారు. ఈ ఏడాది మండలంలోని లంపకలోవ, పెదశంకర్లపూడి, రౌతుపాలెం, ఉత్తరకంచి, గోకవరం, ఒమ్మంగి, రాచపల్లి, శరభవరం, పోతులూరు, బవురువాక గ్రామాల్లో రైతులు సుమారు 900 ఎకరాల్లో సేంద్రియ సాగు సాగు చేపట్టారు. నియోజకవర్గంలో సుమారు రెండు వేల మంది రైతులు సేంద్రియ పద్ధతుల్లో వరి సాగు చేపట్టారు. ప్రకృతి సేద్యం ద్వారా కేవలం రూ.500 నుంచి రూ.700 లోపు పెట్టుబడితో ఎకరా వరి పొలంలో 25 నుంచి 30 బస్తాల దిగుబడులు సాధించవచ్చని రైతులు చెబుతున్నారు.

తక్కువ ఖర్చుతో..

ప్రకృతి సేద్యంపై మొగ్గు చూపుతున్న రైతులు వ్యవసాయ రంగంలో పెను మార్పులు తీసుకొస్తున్నారు. సులభ పద్ధతిలో ఎరువులను తయారు చేసుకుని, ఖర్చులు తగ్గించుకుంటున్నారు. అధిక దిగుబడితో పాటు మంచి లాభాలను గడిస్తున్నారు. రసాయన ఎరువులు పెరగడం, వాటి వల్ల లాభాలు లేకపోవడంతో ఈ విధానంపై చాలా మంది రైతులు ఆసక్తి చూపుతున్నారు.

బ్రహ్మాస్త్రం తయారీ విధానం

వేప, సీతాఫలం, గానుగ, ఉమ్మెత్త, ఆముదం ఆకులను 20 లీటర్ల ఆవు మూత్రంలో ఉడికించి చేసే కషాయాన్ని ‘బ్రహ్మాస్త్రం’ అని పిలుస్తారు. ఈ కషాయంను పైరుపై పిచికారీ చేస్తే పంటను ఆశించే పురుగులు నశిస్తాయి.

నీమాస్త్రం

200 లీటర్ల నీటిలో 10 లీటర్ల ఆవు మూత్రం, రెండు కిలోల ఆవుపేడ, 10 కిలోల వేపాకులు కలిపి రెండు రోజులు (48 గంటలు) నానబెట్టాలి. ఇలా వచ్చిన (నీమాస్త్రం) మిశ్రమాన్ని మూడో రోజు వడబోసి పంటలపై పిచికారీ చేయాలి. ఫలితంగా పంటలను ఆశించిన తెగుళ్ల (రసం పీల్చే పురుగులు)ను సమూలంగా నిర్మూలించవచ్చు.


జీవామృతం తయారు చేస్తున్న రైతు

జీవామృతం తయారీ ఇలా..

200 లీటర్ల నీటిలో 10 లీటర్ల ఆవు మూత్రం, 10 కిలోల ఆవుపేడ, రెండు కిలోల బెల్లం, రెండు కిలోల పప్పు దినుసుల పిండి, పిడికెడు పుట్టమట్టి కలిపి రెండు రోజుల (48 గంటలు) పాటు నానబెట్టి వడపోయాలి. ఇలా వచ్చిన జీవామృతాన్ని నీటి ద్వారా పైరుకు పారనివ్వాలి. తద్వారా భూసారం పెరుగుతుంది.

అజొల్లా ఎరువు తయారీ

నీరు నిల్వ ఉండేలా చతురస్రాకారంలో గుంత తవ్వి పేడ, బెల్లం నీటితో కలిపి వారం రోజుల పాటు నిల్వ ఉంచాలి. దీంతో ‘అజొల్లా’ ఎరువు తయారవుతుంది. దీనిని యూరియాకు ప్రత్యామ్నాయంగా వాడుకోవచ్చు. ఇది ప్రధానంగా కలుపు నివారణకు ఉపయోగపడుతుంది. ఎకరాకు 8 కేజీల అజొల్లాను వేసుకోవాలి.

ఆరోగ్యకరమైన దిగుబడులు



సేంద్రియ సాగు వల్ల ఖర్చులు చాలా వరకు తగ్గాయి. రూ.10 వేల పెట్టుబడితో రసాయన ఎరువులు వినియోగించి పంట సాగు చేసే పొలాన్ని ప్రకృతి సేద్యం విధానంలో రూ.1,000తో సాగు చేయవచ్చు. పైగా ఆరోగ్యకరమైన దిగుబడులు వస్తున్నాయి. సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తులను వాడడం వల్ల ఆరోగ్యం కూడా మెరుగుపడింది.

– రాసంశెట్టి రాజా, రైతు, పెదశంకర్లపూడి

పెట్టుబడి ఖర్చు తగ్గుతుంది



మొక్కల పెరుగుదలకు 16 రకాల పోషకాలు అవసరం. రసాయన ఎరువుల కంటే సేంద్రియ ఎరువులను ఉపయోగిస్తే సూక్ష్మపోషకాలు సంవృద్ధిగా అందుతాయి. నాణ్యమైన దిగుబడులు వస్తాయి. పెట్టుబడి ఖర్చు తగ్గుతుంది. అందుకే రైతులు ప్రకృతి సేద్యంపై దృష్టి సారించాలి.

– యింటి వీర గంగాధర్, సహాయ వ్యవసాయ సంచాలకులు, జగ్గంపేట

ఉచిత కంటి వైద్య శిబిరం


వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ హిమజ

ఏలేశ్వరం: ప్రతిఒక్కరూ కంటిచూపు పట్ల అప్రమత్తంగా ఉండాలని రాజానగరం జీఎస్ఎల్ ఆసుపత్రి వైద్యురాలు హిమజ సూచించారు. లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక కోనేటిబడి సమీపంలోని స్వర్గీయ డాక్టర్ షణ్ముఖరావు ఆసుపత్రిలో సోమవారం ఏర్పాటు చేసిన కంటివైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా హిమజ మాట్లాడుతూ మానవుని అవయవాల్లో కంటికి ప్రత్యేక స్థానం ఉందన్నారు. కంటి సంరక్షణకు ప్రతిఒక్కరూ అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. జీఎస్ఎల్ ఆసుపత్రి వైద్యులు సుమారు వంద మందికి కంటి పరీక్షలు చేశారు. వీరిలో 11 మందిని శస్త్రచికిత్స నిమిత్తం రాజానగరం జీఎస్ఎల్‌కు తరలించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు అలమండ దుర్గావెంకటప్రసాద్, తూమురౌతు గురయ్య, కందులప్రభాకర్, కటకం కిరీటీ తదితరులు పాల్గొన్నారు.

మహిళా దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

జగ్గంపేట: ఏలేశ్వరంలో ఈ నెల 8న నిర్వహించే అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని అఖిల భారత ప్రగతిశీల మహిళా సంఘం సభ్యులు కోరారు. ఈ మేరకుసోమవారం జిల్లా మహిళా సంఘం నాయకులు కాకా రత్నకుమారి, వల్లూరి నాగమణి ఆధ్వర్యంలో జగ్గంపేటలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ జిల్లా కార్యదర్శి ఏగుపాటి అర్జునరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నిత్యావసరాల ధరలను పెంచి పేదల నడ్డి విరుస్తుందన్నారు. మహిళల రక్షణ చట్టాల అమలపై ప్రభుత్వాల నిర్లక్ష్యం వహించడం తగదన్నారు. ఏలేశ్వరంలో జరిగే మహిళా దినోత్సవ కార్యక్రమాలను విజయవంత చేయాలని కోరారు. కార్యక్రమంలో మహిళా నాయకులు, లిబరేషన్ పార్టీ నేతలు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

రౌతులపూడి: కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వం అందిస్తున్న వసతులను సద్వినియోగం చేసుకుని ప్రతి విద్యార్థి ఉత్తమ ఫలితాలు సాధించాలని వైస్ ఎంపీపీ సూరెడ్డి సాయి సూచించారు. మండలంలోని లచ్చిరెడ్డిపాలెంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సోమవారం ఆయన ఎంఈఓ ఎస్వీ నాయుడుతో కలిసి సందర్శించారు. విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాలను పరిశీలించి రుచి, నాణ్యతపై ఆరా తీశారు. నిర్ణీత సమయంలో సిలబస్‌ను పూర్తిచేసి రానున్న పబ్లిక్ పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేయాలని ఎంఈఓ ఎస్వీ నాయుడు సూచించారు.

తిరుపతి దేవస్థానానికి సేంద్రియ బియ్యం తరలింపు


ప్రత్యేక వాహనంలో తిరుపతికి బియ్యం తరలిస్తున్న దృశ్యం

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని గజ్జనపూడి గ్రామం నుంచి తిరుపతి దేవస్థానానికి సోమవారం సేంద్రియ బియ్యం తరలించారు.గజ్జనపూడికి చెందిన రైతు మంతిన సుబ్రహ్మణ్య కృష్ణంరాజు పొలంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించి ఆడించగా వచ్చిన రూ.4.20 లక్షలు విలువ చేసే ఆరు టన్నుల బియ్యాన్ని సేవ్ ఫౌండేషన్ ఫౌండర్ విజయ్‌రామ్ కొనుగోలు చేసి తిరుమల తిరుపతి దేవస్థానానికి ప్రత్యేక వాహనంలో తరలించారు. ఈ సందర్భంగా కృష్ణంరాజు మాట్లాడుతూ అత్యంత పురాతన దేశవాళి విత్తనాలతో సేంద్రీయ పద్ధతిలో ఈ ధాన్యాన్ని సాగు చేసినట్టు తెలిపారు. సేవ్ ఫౌండేషన్ ఫౌండర్ విజయ్‌రామ్ ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను కొనుగోలు చేసి సెంద్రియ సాగుపై రైతులను ప్రోత్సహిస్తున్నట్టు చెప్పారు.

కొత్తయర్రవరంలో ఆయుష్మాన్ భారత్


కొత్తయర్రవరంలో ర్యాలీ చేస్తున్న వైద్య, సచివాలయ సిబ్బంది

ఏలేశ్వరం: మండలంలోని కొత్తయర్రవరంలో సోమవారం వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఆయుష్మాన్ భారత్ కార్యక్రమం చేశారు. జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ప్రైవేట్ కళాశాలలో బేటీ బచావో–బేటీ పడావో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ బీశెట్టి అప్పలరాజు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఆడపిల్లలను చదివించాలన్నారు. ఆడపిల్లల పట్ల చిన్నచూపు చూడరాదన్నారు. లింగనిష్పత్తి ప్రకారం ఆడపిల్లలు ఉండాలన్నారు. ఎవరూ లింగవివక్షత చూపరాదని, గర్భస్థ లింగనిర్ధారణ చట్టప్రకారం నిషేధమన్నారు. అనంతరం గ్రామంలో ప్లకార్డులతో ర్యాలీ చేసి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రామరాజు, ఎఎన్ఎం లక్ష్మీదేవి, రామిశెట్టి వెంకటరమణ, సిబ్బంది పాల్గొన్నారు.

పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కార్యవర్గం ఎన్నిక


పాస్టర్స్ ఫెలోషిప్ తుని పట్టణ, మండల నూతన కార్యవర్గం

తుని రూరల్: తుని పట్టణ, మండల పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కార్యవర్గ అధ్యక్ష, కార్యదర్శులుగా డి.జాన్ డేవిడ్, ఎస్.జోసెఫ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎస్.అన్నవరం శివారు కృష్ణ నగర్‌లోని జి.త్రినాథ్ ప్రార్థన మందిరంలో పాస్టర్లు ఎస్.సాల్మన్‌రాజు, కె.ఫిలిప్ ఆధ్వర్యంలో సోమవారం తుని పట్టణ, మండల పాస్టర్స్ ఫెలోషిప్, సంఘ కాపరుల నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. సంఘ అధ్యక్షుడిగా డి.జాన్ డేవిడ్, కార్యదర్శిగా ఎస్.జోసెఫ్, ఉపాధ్యక్షుడిగా కేజే ప్రభాకర్, సహాయ కార్యదర్శిగా కె.విజయ్ కుమార్, కోశాధికారిగా టి.ప్రవీణ్ కుమార్, ఉప కోశాధికారిగా కె.నతనేలు, పలువురు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ సంఘం బలోపేతానికి, క్రైస్తవుల అభ్యున్నతికి నిరంతరంగా కృషి చేస్తామన్నారు. తుని పట్టణ, మండలానికి చెందిన ఫెలోషిప్ ప్రతినిధులు పాల్గొన్నారు.

గ్రామాలకు సమృద్ధిగా తాగునీరు అందించాలి

తుని రూరల్: మండల పరిధిలోని అన్ని గ్రామాలకు సమృద్ధిగా తాగునీరు సరఫరా చేయాలని ఎంపీడీఓ ఎస్.సుబ్రహ్మణ్యశర్మ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సోమవారం ఆయన సమావేశం నిర్వహించారు.

తాగునీటి సరఫరా, చేతి పంపులు మరమ్మతులు, నిరంతర విద్యుత్, 15వ ఆర్థిక సంఘం నిధుల వినియోగంపై ఆరా తీశారు. కుళాయిలు ద్వారా తాగునీరు సరఫరా చేయడంలో నిర్లక్ష్యం వహించరాదని, బోరుబావులు అందుబాటులో ఉంచాలని, పాడైపోయిన బోరుబావులకు వెంటనే మరమ్మతులు చేయించాలని, అత్యవసర తాగునీటి సరఫరాకు 15వ ఆర్థిక సంఘం నిధులు వినియోగించాలని సూచించారు. అదనపు విద్యుత్ మోటార్లను సిద్ధం చేసుకోవాలన్నారు. శివారు గ్రామాలకు సైతం తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈఓపీఆర్డీ ఎస్.జయరాం, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శివాజీ, కార్యదర్శులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు ఆర్థిక సాయం


అవల్దార్‌పాడులో అగ్నిప్రమాద బాధితులకు ఆర్థిక సహాయం అందిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

తొండంగి: మండలంలోని పెరుమాళ్లపురం పంచాయతీ అవల్దార్‌పాడులో అగ్నిప్రమాద బాధితులకు వైఎస్సార్ సీపీ నాయకులు సోమవారం ఆర్థిక సాయం అందజేశారు. తుని వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొయ్యా మురళి, వైస్ ఎంపీపీ–2 యాదాల రమణ, పంచాయతీ వైస్ సర్పంచ్, ఎంపీటీసీలు కలిసి బాధితులు కొంజెర్ల సత్యవతి, నాగలోవ దుర్గ కుటుంబాలను పరామర్శించారు. రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖమంత్రి దాడిశెట్టి రాజా ఆదేశాల మేరకు తక్షణ సహాయంగా రూ.25 వేలు అందజేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ పెరుమాళ్ల లోవరాజు, ఎంపీటీసీలు అంబుజాలపు అప్పలరాజు, అంబుజాలపు సత్తిబాబు, యాదాల చక్రి, యాదాల కృష్ణ, కాలిన కొండబాబు పాల్గొన్నారు.

బీసీ బాలికల హాస్టల్‌లో తనిఖీలు

ప్రత్తిపాడు: స్థానిక ప్రభుత్వ బీసీ బాలికల వసతి గృహాన్ని ప్రత్తిపాడు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి కాటం భాను సోమవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. వసతి గృహం పరిసరాలను క్షుణంగా పరిశీలించారు. బాలికల కోసం తయారు చేసిన ఆహార పదార్థాలను తనిఖీ చేశారు. విద్యార్థులకు అందించే భోజనం, పరిసరాల శుభ్రత పట్ల న్యాయమూర్తి కాటం భాను సంతృప్తి వ్యక్తం చేశారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

చట్టాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని న్యాయమూర్తి కాటం భాను సూచించారు. స్థానిక ప్రభుత్వ బీసీ బాలికల వసతిగృహంలో సోమవారం న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు ఎదుర్కొనే సమస్యల పరిష్కారం కోసం పలు చట్టాలు ఉన్నాయన్నారు. ఈ చట్టాల గురించి విద్యార్థినులు తమ తల్లులు, సోదరులకు వివరించాలని సూచించారు. కార్యక్రమంలో కోర్టు లోక్ అదాలత్ బాధ్యురాలు శ్రీలక్ష్మి, వసతిగృహ సంక్షేమాధికారి ఎం.శైలజారాణి, వసతిగృహ సిబ్బంది పాల్గొన్నారు.

బాలుడి వైద్యానికి విరాళాల సేకరణ


గోకవరంలో బాలుడి వైద్యానికి విరాళాలు సేకరిస్తున్న దృశ్యం

గోకవరం: అరుదైన సీజీడీ వ్యాధితో బాధపడుతున్న గోకవరానికి చెందిన రెండున్నరేళ్ల బాలుడు సత్యశ్రీ అక్షయ్‌రామ్ వైద్యం కోసం సోమవారం విరాళాలు సేకరించారు. వారపు సంత కావడంతో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పాలూరి బోసుబాబు ఆధ్వర్యంలో షాపుల వద్దకు వెళ్లి బాలుడి పరిస్థితి గూర్చి వివరించి దాతల సహాయం కోరారు. దీనిపై పలువురు వ్యాపారస్తులు ముందుకు వచ్చి సుమారు రూ.40 వేలు వరకు విరాళాలు అందించారు. ఈ సందర్భంగా బోసుబాబు మాట్లాడుతూ బాలుడి వైద్యానికి రూ.30 లక్షల వరకు ఖర్చవుతుందని, ఇప్పటి వరకు వివిధ వర్గాలకు చెందిన దాతల ద్వారా రూ.9 లక్షలు సమకూరాయన్నారు. ప్రభుత్వపరంగా బాలుడిని ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ ఎస్ఎస్ ఆలీషా తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం


ఆదర్శపాఠశాల్లో విద్యార్థులతో ఎంపీపీ పర్వత రాజబాబు


కిర్లంపూడిలో డ్యాన్స్ చేస్తున్న విద్యార్థులు

శంఖవరం: స్థానిక ఆదర్శ పాఠశాల వార్షికోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆటలు, పాటల పోటీలు నిర్వహించారు. విజేతలకు ఎంపీపీ పర్వత రాజబాబు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. ఈ ఏడాది పదో తరగతి పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎంపీడీఓ జె.రాంబాబు, ఎంఈఓ ఎస్వీ రమణ, ప్రిన్సిపాల్ కృష్ణవేణి, సర్పంచ్ బందిలి గనియమ్మ, వైస్ సర్పంచ్ చింతనీడి కుమార్, చైర్మన్ జట్లా అప్పారావు పాల్గొన్నారు.

ఉత్సాహంగా పాఠశాల వార్షికోత్సవం

కిర్లంపూడి: స్థానిక కొక్కొండ రామశేషగిరి రావు పంతులు ప్రభుత్వ ఉన్నత పాఠశాల వార్షికోత్సవం సోమవారం రాత్రి ఉల్లాసంగా ఉత్సాహంగా జరిగింది. పాఠశాల ఆవరణలో విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. పలువురు విద్యార్థులు నృత్యప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. పలు పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. సర్పంచ్ మహేంద్రాడ శ్రీలత, వైస్ ఎంపీపీ బొడ్డేటి గణపతి, సొసైటీ చైర్మన్ చదలవాడ బాబీ పాల్గొన్నారు.

హైస్కూల్ ఉన్న ప్రాంతానికి హాస్టల్ తరలింపు

సాక్షి ఎఫెక్ట్


తిమ్మరాజుపేట హాస్టల్‌ను పరిశీలిస్తున్న సోషల్ వెల్ఫేర్ జిల్లా అధికారి సత్యరమేష్

కోటనందూరు: మండలంలోని తిమ్మరాజుపేటలో ఉన్న బీసీ బాలికల వసతి గృహాన్ని హైస్కూల్ ఉన్న ప్రాంతానికి తరలిస్తామని జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి పిల్లి సత్యరమేష్ సోమవారం తెలిపారు. ‘వసతులు ఫుల్..చేరికల్ డల్’ శీర్షికతో ఆదివారం ‘సాక్షి’లో ప్రచురితమైన కథనానికి సోషల్ వెల్ఫేర్ జిల్లా అధికారి రమేష్ స్పందించారు. వసతి గృహాన్ని సందర్శించి విచారణ చేయగా హాస్టల్ ఉన్న గ్రామంలో ప్రాథమిక పాఠశాల మాత్రమే ఉండటంతో విద్యార్థినులు హాస్టల్‌లో చేరడం లేదని గుర్తించామన్నారు. దగ్గరలో ఉన్నత పాఠశాలలు ఉన్న కేఈ చిన్నయ్యపాలెం, పాతకొట్టాం, మండల కేంద్రం కోటనందూరు గ్రామాల్లో ఏదో చోటుకు హాస్టల్ తరలిస్తామన్నారు. దీనిపై మంత్రి దాడిశెట్టి రాజా, జిల్లా కలెక్టర్ కృతికాశుక్లాకు నివేదిక సమర్పిస్తానన్నారు. మంత్రి, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తగు చర్యలు తీసుకుంటామని సోషల్ వెల్ఫేర్ అధికారి సత్యరమేష్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి


ఘటనా స్థలంలో వీరబాబు మృతదేహం

గండేపల్లి: పదహారో నంబర్ జాతీయ రహదారిపై నీలాద్రిరావుపేట వద్ద సోమవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు.. కడియానికి చెందిన వీరబాబు (40), రామకృష్ణ మోటారు సైకిల్‌పై అనకాపల్లి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో నీలాద్రిరావుపేట శివారు వాటర్ ట్యాంక్ సమీపంలోకి వచ్చేసరికి వారు ప్రయాణిస్తున్న మోటారు సైకిల్ అదుపుతప్పి జారిపడింది. ఈ ప్రమాదంలో వీరబాబు తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. రామకృష్ణకు తీవ్రగాయాలయ్యాయి. అతడిని చికిత్స కోసం 108లో సమీపంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గండేపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. రోడ్డుపై మట్టి ఉండడంతో మోటారు సైకిల్ అదుపు తప్పి జారిపడినట్టు స్థానికులు తెలిపారు.

పేకాడుతున్న తొమ్మిది మంది అరెస్టు

జగ్గంపేట: మండలంలోని మల్లిసాల శివారు సంతమార్కెట్ వద్ద రహస్యంగా నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై సోమవారం రాత్రి పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో పేకాడుతున్న 9 మందిని అరెస్టు చేసి వారి నుంచి రూ.2090 స్వాధీనం చేసుకున్నట్టు జగ్గంపేట ఎస్సై విద్యాసాగర్ తెలిపారు. అరెస్టు చేసిన వారిని మంగళవారం కోర్టుకు హాజరు పరుస్తామని వివరించారు.

సారా నిర్మూలనకు చర్యలు తీసుకోవాలని వినతి


నీలాద్రిరావుపేటలో సర్పంచ్‌కు వినతి పత్రం అందజేస్తున్న గ్రామస్తులు

గండేపల్లి: మండలంలోని నీలాద్రిరావుపేటలో సారా విక్రయాలు జోరుగా సాగుతుండటంతో కుటుంబాలు అతలాకుతలం అవుతున్నాయని, సారాను అరికట్టాలని గ్రామస్తులు కోరారు. ఈ మేరకు సోమవారం గ్రామ సర్పంచ్ ములంపాక సురేష్‌కు వినతపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతు గ్రామంలో సారా నిర్మూలన, అసాంఘిక కార్యకలాపాల కట్టడికి చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం సారాపై సమరం నినాదంతో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఇకపై గ్రామంలో సారా విక్రయాలు జరిగితే దృష్టికి పోలీసులకు ఫిర్యాదు చేస్తామని గ్రామస్తులు ప్రతిజ్ఞ చేశారు. గ్రామ ఉప సర్పంచ్ గండికోట శ్రీను, శ్రీనివాస్, సుబ్రహ్మణ్యం, ఎస్.రమణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

హత్యాయత్నంపై కేసు నమోదు

కిర్లంపూడి: హత్యాయత్నంపై కేసు నమోదు చేసినట్టు స్థానిక ఎస్సై టి.రఘునాథరావు తెలిపారు. వివరాల్లోకి వెళితే..గోనేడ గ్రామానికి చెందిన అరటా వెంకట రమణకు తన మేనల్లుడు తోటకూర స్వామికి కొన్ని రోజులుగా సరిహద్దు గొడవలు ఉన్నాయి. సోమవారం ఇంటి నిర్మాణం కోసమని స్వామి గోతులు తీస్తుండగా సరిహద్దులు పరిష్కారం కాకుండా గోతుల తీయటం ఏమిటని వెంకట రమణ అడగడంతో ఇద్దరి మధ్య వివాదం నెలకొంది. దీంతో స్వామి కత్తితో వెంకట రమణపై దాడి చేయడంతో పొట్టమీద, ఎడమ కాలు తొడపైన తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రుడు కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. దీనిపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై టి.రఘునాథరావు తెలిపారు.